

Dr.G.Rajesh
CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 115 ఎడిటర్ : జి.రాజేష్ బుధవారం 22 జులై 2026 పేజీలు : 6 వెల రూ. 4.00



## మంగళగిరి కోసం బాబుతో గొడవ పడ్డా

- నిధులకు కొరత ఉన్నా, అభివృద్ధిలో వెనకడుగు లేదు
- నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీలో లోకేశ్

2లో

## ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ మెరుపు ధర్నా

- జంతర్‌మంతర్ ఆందోళనకారులపై లాఠీఛార్జ్‌కు నిరసన
- అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు
- ప్రధాని మోదీ రాజీనామా చేయాలన్న రాహుల్ గాంధీ

వివరాలు 2లో





## పొగాకు రైతులను పట్టించుకోని బాబు

మిగతా 2లో

- మొద్దునిద్ర పోతున్న ప్రభుత్వాన్ని తట్టి లేపాల్సిందే
- మద్దతు ధరలు దక్కక పోవడంతో రైతులకు నష్టం
- మా ప్రభుత్వ హయాంలో 3వేల కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్
- త్వరలోనే గోదావరి జిల్లాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటా
- పొగాకు రైతులకు అండగా ఉంటానని వైఎస్ జగన్ హామీ

అమరావతి,జూలై22(ఆర్ఎన్ఎ):ధ

ధరల సంక్షోభంతో తల్లడిల్లుతున్న పొగాకు రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు 10 రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. నిద్రపోతున్న ప్రభుత్వాన్ని లేపడం సులభం. కానీ నిద్ర నటిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని లేపాలంటే మరింత గట్టిగా ఒత్తిడి తీసుకురావాల్సిందే.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పొంగులేటి



హైదరాబాద్,జూలై22(ఆర్ఎన్ఎ):

పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటిఅవకాశం ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. గతంలో చేసిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి తెలిపారు.

## తల్లికి వందనంతో పిల్లలకు భరోసా



2లో

42,70,842 మంది తల్లుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ

టిడిపి ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వెల్లడి



## పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

2లో

జగన్ పాలనలో పొగాకు రైతలకు నష్టమే జరిగింది

మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

మిగతా 2లో

- ప్రధాని మోదీని ఆహ్వానించిన సీఎం చంద్రబాబు
- సుమారు 30 నిముషాల పాటు వివిధ అంశాలపై చర్చ
- పలువురు కేంద్రమంత్రులతోనూ బాబు వరుస భేటీలు
- గోదావరి, కావేరీ అనుసంధానంపై పాటిల్‌తో చర్చలు



న్యూఢిల్లీ,జూలై22(ఆర్ఎన్ఎ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. ఈరోజు(బుధవారం) చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు.

## ఎల్‌నినోతో పెరిగిన విద్యుత్ డిమాండ్

- ఇబ్బంది లేకుండా థర్మల్ విద్యుత్ ఉత్పాదన పెంపు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి,జూలై22(ఆర్ఎన్ఎ):

ఎల్ నినో ప్రభావంతో తగ్గిన జల విద్యుత్ ఉత్పత్తితో ఇబ్బందులు లేకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెంచాలని ఉన్నతాధికారులను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. బుధవారం రాజధాని అమరావతిలో రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో పరిస్థితులపై అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు. 15 రోజుల విద్యుత్ ఉత్పత్తికి తగిన విధంగా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుత రోజువారీ డిమాండ్

- మిగతా 2లో



## సోనమ్ జీ దీక్ష విరమించండి

ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే విజ్ఞప్తి

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి



. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగిందిటీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు.

ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గోదావరి - కావేరీ నదుల అనుసంధానంపై కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి - కావేరీ అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు



చేయాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నుంచి కావేరీ అనుసంధానం కన్నా బనకచర్ల నుంచి కావేరీ అనుసంధానం మంచిదని కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించినట్లు తెలుస్తోంది.

దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జల్‌శక్తి శాఖ.. అన్ని రాష్ట్రాలు భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. సముద్రంలోకి నీరు పోవడం కంటే.. ఉపయోగంలోకి వస్తే బాగుంటుందని కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం సూచించారు. అన్ని రాష్ట్రాలను ఒప్పిస్తే కేంద్ర ప్రతిపాదనతో తనకు అభ్యంతరం లేదని.. అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా.. ఇందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించినట్లు తెలుస్తోంది.

# ఎల్‌నినోతో పెరిగిన విద్యుత్ డిమాండ్



280 మిలియన్ యూనిట్‌లకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆయన స్పష్టం చేశారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై విద్యుత్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. ఎల్ నినోతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. వర్షాభావ పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని వారికి సూచించారు. ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంల సమన్వయంతో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి వివరించారు. ఈ సమీక్ష సమావేశానికి ఏపీ ట్రాన్స్ కో, జెన్‌కో ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇదిలావుంటే పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా పెదపులిపాక గ్రామంలో రూ.4.20 కోట్ల నిధులతో నిర్మించిన నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ను స్థానిక ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్, కూటమి నాయకులు, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సబ్ స్టేషన్ అందుబాటులోకి రావడంతో పెదపులిపాకతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సామర్థ్యం గణనీయంగా పెరిగి, లో-వోల్టేజ్ సమస్యలు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలు అందనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి ప్రతి ఇంటికీ విశ్వసనీయమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

# పొగాకు రైతులను పట్టించుకోని బాబు

రైతులకు శాశ్వతంగా మంచి జరగాలంటే ప్రజా ప్రభుత్వం రావాల్సిందే. అయితే అప్పటివరకు రైతుల సమస్యల ను వదిలిపెట్టకుండా ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తాం అని అన్నారు. బుధవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతులతో వైఎస్ జగన్ నిర్వహించిన సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా పొగాకు రైతులతో నిర్వహించిన సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ.. పొగాకు రైతులకు అండగా నిలవడం నా బాధ్యత.అందుకే వచ్చే వారం లేదా పది రోజుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తానని అన్నారు. మా ప్రభుత్వ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు దాదాపు రూ.3,000 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌ను ఏర్పాటు చేశాం. ఐదేళ్లలో పంటల కొనుగోళ్లు, మార్కెట్ జోక్యం కోసం రైతుల తరఫున సుమారు రూ.7,800 కోట్లు ఖర్చు చేశాం. ప్రతి రైతుభరోసా కేంద్రాన్ని వ్యవసాయ ధరల పర్యవేక్షణ కేంద్రంగా మార్చాం. ప్రతి పంటకు కనీస గిట్టుబాటు ధరలను ఆర్బీకేల్లో బోర్డులపై ప్రదర్శించాం. ధరలు కనీస స్థాయి కంటే తగ్గిన వెంటనే ఆర్బీకే వ్యవసాయ సహాయకుడు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసే వ్యవస్థను తీసుకొచ్చాం. గత ఏడాది ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నాను. ఈసారి గోపాలపురం లేదా జంగారెడ్డిగూడెంలో రైతులను ప్రత్యక్షంగా కలిసి వారి కష్టాలు తెలుసుకుంటాను. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చే కార్యక్రమాన్ని అక్కడి నుంచే ప్రారంబి,స్తాను. ఈ పర్యటన తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోతే కొద్దిరోజుల వ్యవధిలో కందుకూరులో మరో పర్యటన నిర్వహిస్తాను. పొగాకు రైతుల సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం స్పందించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తాను. ఏ జిల్లాలో, ఏ పంట రైతులు ఇబ్బందులు పడుతున్నా వైఎస్సార్‌సీపీ వారికి అండగా నిలుస్తుందని అన్నారు.



పొగాకు వేలం ప్రారంభమై దాదాపు 94 రోజులు గడిచినా పండిన పంటలో కేవలం 16.5 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. రాష్ట్రంలో సుమారు 232 మిలియన్ కిలోల పొగాకు పండితే ఇప్పటివరకు కేవలం 38 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు చేశారు. సాధారణంగా 100 రోజుల్లో పూర్తి కావాల్సిన కొనుగోలు ప్రక్రియలో 94 రోజులు గడిచినా ఐదో వంతు పంట కూడా కొనకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. సెప్టెంబరులో కర్ణాటకలో వేలం ప్రారంభమైతే వ్యాపారులు అక్కడికి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన పంటను ఎవరు కొంటారనే భయాందోళన రైతుల్లో నెలకొందన్నారు. పొగాకు ధర రూ.200కు తగ్గకూడదని చంద్రబాబు సమీక్షలో చెప్పిన మరుసటి రోజే మార్కెట్లో ధరలు భారీగా పడిపోయాయి. పొదిలిలో రూ.179, టంగుటూరులో రూ.184, కనిగిరిలో రూ.184, కందుకూరులో రూ.186, జంగారెడ్డిగూడెంలో రూ.170, గోపాలపురంలో రూ.130కు కొనుగోలు చేశారు. చంద్రబాబు హెచ్చరించిన మరుసటి రోజే ధరలు పడిపోవడం వ్యాపారుల సిండికేట్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తోంది..మమ్మల్ని బతికించండి' అని రైతులు వేడుకోవాల్సిన దుస్థితికి చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చింది. కొనుగోళ్లలో నో-బిడ్లు పెట్టడం,పెద్దఎత్తున బేళ్లను తిరస్కరించడం ద్వారా రైతులను మరింత నష్టపరుస్తున్నారు. వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతులకు మంచి ధర రావాలనే ఉద్దేశంతో టొబాకో బోర్డు ఏర్పాటైంది.

# సోనమ్ జీ దీక్ష విరమించండి



న్యూఢిల్లీ,జూలై22సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష విరమించాలని కాక్రోచ్ జనతా పార్టీ అధినేత అభిజీత్ దీప్కే విజ్ఞప్తి చేశారు. దేశానికి వాంగ్‌చుక్ అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం దీప్కే తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని కోరుతున్నాము. దేశానికి ఆయన అవసరం ఉంది. ఆయన ప్రాణం చాలా విలువైనది. దాన్ని మరింత ప్రమాదంలో పడేయకూడదు. డిమాండ్లు నెరవేరే వరకు జంతర్‌మంతర్ వద్ద శాంతియుత నిరసనలు కొనసాగుతాయి' అని రాసుకొచ్చారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించటంతో హైకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు కొద్దిరోజుల క్రితం జంతర్ మంతర్ వద్ద నుంచి ఆయనను బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. మొదట సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి మార్చారు. ఆయన అక్కడి ఐసీయూలో ఉంటూనే.. డాక్టర్ల బలవంతపు ఫీడింగ్‌ను నిరాకరిస్తూ దీక్షను కొనసాగిస్తున్నారు.

# పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

అమరావతి,జూలై22: పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వారికి అన్ని విధాల అండగా నిలుస్తామని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. గతేడాది 25 మిలియన్ల బర్లీ పొగాకు రూ.304 కోట్లతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. జగన్ పాలనలో పొగాకు రైతులకు నష్టం తప్ప, జరిగిన మంచి శూన్యం అని గుర్తు చేశారు. పొగాకు రైతుల గురించి మాజీ సీఎం జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఏనాడైనా పొగాకు రైతుల సమస్యలు పట్టించుకున్నారా? అని వైసీపీ అధినేతను ఈ సందర్భంగా మంత్రి డోలా సుటిగా ప్రశ్నించారు. పొగాకు కొనుగోళ్ల సమస్యపై సీఎం చంద్రబాబు వెంటనే బోర్డు అధికారులతో సమీక్షించారని వివరించారు.

అలాగే కేంద్ర మంత్రులతో కూడా ఇదే అంశంపై మాట్లాడారని తెలిపారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలసి పొగాకు రైతులకు న్యాయం చేయాలని కోరామని ఈ సందర్భంగా చెప్పారు.

# మంగళగిరి కోసం బాబుతో గొడవ పడ్డా



గుంటూరు,జులై22 మంగళగిరి నియోజకవర్గంలో రెండో రోజు పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. 'మన ఇల్లు - మన లోకేశ్' పేరిట మంత్రి నారా లోకేశ్.. ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. రెండు రోజుల్లో 3,000 మందికి పట్టాలను పంపిణీ చేయనున్నారు. కొండవాలు ప్రాంతాలు, అటవీ భూములు, దేవాలయ భూముల్లో ఇల్లు నిర్మించుకొని దశాబ్దాలుగా ప్రజలు నివసిస్తున్నారు. దీంతో అర్హులైన పేద కుటుంబాలకు మంత్రి బట్టలు పెట్టి.. పసుపు, కుంకుమలతో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధుల కొరత ఉన్నా మంగళగిరిలో అభివృద్ధి ఆగట్లేదని తెలిపారు. మంగళగిరి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుతో కూడా గొడవ పెట్టుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ నిధులతో ఇబ్బంది ఉంటే సీఎస్సార్ నిధులు, వివిధ ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలు లేకుండా పారదర్శకంగా ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టామన్నారు. ఇచ్చిన హామీ మేరకు బొట్టు పెట్టి ఇళ్ల పట్టాలను అందజేస్తున్నట్లు చెప్పారు. దేశం మొత్తం నిడమర్రు పాఠశాల గురించి మాట్లాడుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇంటి పట్టాలతో పాటు భూగర్భ డ్రైనేజీ, 100 పడకల ఆసుపత్రి, నీటి సమస్య.. ఇలా అన్నింటికీ రెండేళ్లలోనే పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. మంగళగిరి ప్రజలు ఓడించారనే కసితో ఇంకా బాగా పనిచేశానని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షంలో ఉండగా 29 సంక్షేమ పథకాలను సొంత నిధులతో అమలు చేసి.. అధికారం ఇస్తే ఇంకెలా చేస్తానో అనే భరోసా కల్పించానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# తల్లికి వందనంతో పిల్లలకు భరోసా

అమరావతి,జూలై22 తల్లికి వందనంతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్ సారథ్యంలో తల్లుల ఖాతాల్లో బుధవారం తల్లికి వందనం నిధులు జమ అవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 67,47,190 మంది విద్యార్థులకు రూ.10,120 కోట్ల ఆర్థిక సాయం చేశామని ఆయన వివరించారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా 42,70,842 మంది తల్లుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేశామని చెప్పారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి నగదు ఇస్తామన్న చెప్పిన హామీని అమలు చేసి చూపించామని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు. అందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి గతంలో తల్లులను మోసం చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. ఒక్క బిడ్డకే పరిమితం చేసి 25 లక్షల మందికి అమ్మ ఒడిని గొడ్డలి పార్టీ ఎగ్గొట్టిందని విమర్శించారు. 2023-24లో కేవలం కొంత మందికే ఇచ్చి పిల్లల కడుపు కొట్టిరంటూ వైఎస్ జగన్ వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. నేడు కూటమి ప్రభుత్వంలో అదనంగా 17,000 మంది అంగన్‌వాడీల పిల్లలకు కూడా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. అయితే తల్లికి వందనం పథకంపై గొడ్డలి పార్టీ విష ప్రచారం చేస్తుందని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం హామీ అమలు చేస్తే వైసీపీ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. 34.89 లక్షల మంది బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఈ పథకం ద్వారా లబ్ది




చేకూరుతుందని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు తెలిపారు.

# మాచర్ల నియోజకవర్గంలో ఓటర్ల ఎన్యుమరేషన్ 100% పూర్తి

## డిజిటలైజేషన్ 89.75



ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల ప్రతినిధి జూలై 22 : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 101-మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ - Special Intensive Revision కార్యక్రమం జోరుగా సాగుతోంది. 101-మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం తహసీల్దారు కార్యాలయం మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, ఈ నెల 15.06.2026 నుండి ప్రారంభమైన ా×= కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు - దీూాలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. 22.07.2026 సాయంత్రం 4.00 గంటల నాటికి పురోగతి వివరాలు ఇలా ఉన్నాయిమాచర్ల నియోజకవర్గంలో మొత్తం 2,62,801 మంది ఓటర్లు ఉండగా, అందరికీ 100% ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ పూర్తయింది. వాటిలో 2,35,857 ఫారాలను డిజిటలైజ్ చేశారు. ఇది 89.75% కు సమానం.

మండలాల వారీగా వివరాలు:

1. మాచర్ల రూరల్: 44915 ఓటర్లు - 100% పంపిణీ, 90.06% డిజిటలైజేషన్
2. మాచర్ల అర్బన్: 46739 ఓటర్లు - 100% పంపిణీ, 84.87% డిజిటలైజేషన్
3. వెల్దుర్తి: 41643 ఓటర్లు - 100% పంపిణీ, 91.51% డిజిటలైజేషన్
4. దుర్గి: 41934 ఓటర్లు - 100% పంపిణీ, 92.19% డిజిటలైజేషన్5. రెంటచింతల: 40674 ఓటర్లు - 100% పంపిణీ, 90.06% డిజిటలైజేషన్
6. కారంపూడి: 46896 ఓటర్లు - 100% పంపిణీ, 90.29% డిజిటలైజేషన్.

ఓటర్లు తమ వివరాలను సరిచూసుకొని, ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత దీూాలకు త్వరగా అందజేయాలని ఎన్నికల అధికారులు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం, సవ్యమైన ఓటరు జాబితా తయారు చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రకటనను 101-మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఒ జిల్లా రెవెన్యూ అధికారి విడుదల చేశారు.

# బిడ్డల బంగారు భవిష్యత్తుకు 'తల్లికి వందనం'

-ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల ప్రతినిధి జూలై 22: రాష్ట్రంలో విద్యానభ్యసిస్తున్న బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోందని జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తల్లులు ఖాతాల్లో తల్లికి వందనం పథకం నగదు ప్రభుత్వం జమ చేడయం పట్ల ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గం పరిధిలో దాదాపు 40,386 విద్యార్థులకు గానూ 27,732 మంది తల్లుల ఖాతాలో రూ. 60 కోట్ల 57 లక్షల 90 వేల నగదును జయ చేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు ఇచ్చిమాటకు కట్టుబడి విద్యార్థుల కోసం రెండో విడత తల్లికి వందనం పథకం అమలు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యలో నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర , డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాలను ఎంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా చలో భవన్ విజయవంతం




ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి జులై 22చలో లోక్ భవన్ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులువిద్యార్థుల సమస్యలపై గళం విప్పుతూ ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద శాంతియుత ధర్నా నిర్వహించిన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ూ×జజ) పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన "చలో లోక్ భవన్" నిరసన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ నుండి లోక్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, టీపీసీసీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సారథ్యంలో కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్య, ఉపాధి, యువత భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను లేవనెత్తే ప్రతి గొంతును అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమని విమర్శించారు.

దేశంలోని విద్యార్థులు, యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తుందని బండి రమేష్ స్పష్టం చేశారు.

# నందిగామ లో ఘనంగా డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు జన్మదిన వేడుకలు




ఐ ఎన్ బి టైమ్స్ నందిగామ జూలై 22: నందిగామ మాజీ శాసనసభ్యులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ మొండితోగా జగన్మోహన రావు జన్మదినం సందర్భంగా నందిగామ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వేలాదిమంది, పార్టీ కార్యకర్తలు అభిమానుల సమక్షంలో ఆయన జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ , జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరావు , ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయనకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆయన అభిమానులు వేల సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కార్యకర్తలు అభిమానులతో కోలాహలంగా మారిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం. ఉదయం తొమ్మిది గంటల నుండి నియోజకవర్గం నలుమూలల నుండి పార్టీ నాయకులు వివిధ హోదాల్లో ఉన్న ప్రముఖులు, కార్యకర్తలు ఆయన అభిమానులు పార్టీ కార్యాలయానికి చేరుకుని వేదిక పై కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తాళ్లపల్లి గ్రామంలో మృతుల కుటుంబాలను, అనారోగ్యంతో ఉన్నవారిని పరామర్శించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల ప్రతినిధి జూలై 21 : పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామంలో ఇటీవలే మృతి చెందిన వారి కుటుంబాలను, అలాగే అనారోగ్యంతో ఉన్న వారిని పల్నాడు జిల్లా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిసోమవారం పరామర్శించారు. తాళ్లపల్లి గ్రామానికి చెందిన మహంకాళి పున్నమ్మ, దేరంగుల బ్రహ్మయ్య, మన్నెంకుంట నరసింహారావులు ఇటీవలే మరణించిన విషయం తెలుసుకున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారి ఇళ్లకు వెళ్లారు. ముందుగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. "ఈ కష్ట సమయంలో మీకు పార్టీ అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన జూకూరి నారాయణ, పీరసాల అంజయ్యలు అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుసుకున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పిన్నెల్లి పరామర్శతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కష్టంలో ఉన్నప్పుడు నాయకుడు స్వయంగా వచ్చి పలకరించడం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# పల్నాడు జిల్లాలో విషాదం..
# ఇల్లు కూల్చివేతలో తాత, మనవడు దుర్మరణం

ఖఅఅశీఅ: ఐ ఎన్ బి టైమ్స్ పల్నాడు ప్రతినిధి జులై 22 పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగేడ గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది పునర్నిర్మాణం కోసం పాత ఇంటిని కూల్చివేస్తుండగా గోడకు అమర్చిన మెట్లు ఒక్కసారిగా కూలిపోవడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతులు వడ్డెరకు చెందిన గోగుల శ్రీను అలియాస్ రాజబాబు (50), అలాగే అతని నాలుగేళ్ల మనవడు లిగోగుల యశస్విని నికాంత్ (4)లిగా గుర్తించారు. మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది మెట్లు ఇద్దరిపై పడటంతో తీవ్ర గాయాలపాలై ఘటనాస్థలంలోనే మృతి చెందారు. 8సమాచారం అందుకున్న దాచెపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్-ఇన్‌స్పెక్టర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు.





# ప్రజారోగ్య పరిరక్షణకు సేవలందించే కార్యక్రమాలు అభినందనీయం.

## మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు





ఐ ఎన్ బి టైమ్స్ మైలవరం జూలై 22

బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, దోమల నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్, దోమల నివారణ స్ప్రే మిషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమం మైలవరం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ముఖ్య అతిథిగా పాల్గొని వాహనాలు, స్ప్రే మిషన్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య చర్యలు అత్యంత కీలకమని అన్నారు. గ్రామాల ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు సామాజిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో దోమల వ్యాప్తి కారణంగా వచ్చే వ్యాధులను నివారించేందుకు ఫాగింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడం అవసరమని తెలిపారు.బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు.ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములుగా నిలవడం సంతోషకరమని అన్నారు.ప్రజల ఆరోగ్య భద్రత, పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు

.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి కార్యకర్తలు, సామాజిక సేవకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ట్రస్ట్ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించి, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# నల్లచెరువు అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించాలి

**--హైడ్రా అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలు**



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి జూలై 22

బుధవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్పల్లిలోని నల్లచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరిసరాలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై హైడ్రా అధికారులతోసమీక్ష నిర్వహించారు. ప్రధానంగా చెరువు వద్ద టాయిలెట్లు, నీరు సౌకర్యం, ఇండోర్ స్టేడియం, యోగ కేంద్రం ఏర్పాటు కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ నిధుల కొరత ఉంటే తన నిధుల ద్వారా అవసరమైన సదుపాయాల ఏర్పాటుకు సహకరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లచెరువు అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైడ్రా ఆ పనులను కొనసాగించిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నల్లచెరువు అభివృద్ధికి కృషి చేస్తున్న హైడ్రా కమిషనర్ తో పాటు అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. పెండింగ్లో ఉన్న టాయిలెట్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని, దీనిపై హైడ్రా అధికారులు కూడా సానుకూలంగా స్పందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, సీనియర్ నాయకులు తులసిరావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, హైడ్రా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# స్పిరిట్ 40శాతం షూటింగ్ పూర్తి

కీలక అప్డేట్ ఇచ్చిన సందీప్ వంగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్ను పంచుకున్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పవర్ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం. అకాడమీ టాపర్గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# నన్ను అపార్థం చేసుకున్నారు

## నాకెలాంటి సర్జరీ జరగలేదన్న బిగ్‌బి



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇటీవల చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స, ఐసీయూ, కోలుకునే ప్రక్రియ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలతో అమితాబ్కు సర్జరీ జరిగిందని అభిమానులు భావించారు. అయితే ఈ ప్రచారాలపై తాజాగా ఆయన స్వయంగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. బిగ్ బీ తన బ్లాగ్లో శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం ఎంత కష్టమో వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. దీంతో ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందారని, సర్జరీ చేయించుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పోస్టు వెనుక అసలు ఉద్దేశాన్ని అమితాబ్ వివరించారు. నాకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదు. నేను పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నాను. నా పోస్ట్ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన స్పష్టం చేశారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూ నుంచి ఇంటికి వచ్చిన వ్యక్తి ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులను కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే ప్రస్తావించానని చెప్పారు. ఇటీవల జరిగిన అర్జెంటీనా?స్పెయిన్ ఫిఫా మ్యాచ్ను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని అమితాబ్ వెల్లడించారు. ఒక ఛాంపియన్ ఓడిపోయిన తర్వాత తిరిగి నిలబడటం ఎంత కష్టమో చెప్పాలనుకున్నాను. ఫిఫా ఫైనల్లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓడిన తర్వాత మెస్సి పరిస్థితిని ఊహించుకుని ఆ పోస్ట్ రాశాను. కానీ, అది నా ఆరోగ్యానికి సంబంధించినదిగా అందరూ భావించారు అని వివరించారు. అమితాబ్ ఇచ్చిన ఈ వివరణతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.

# ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి



స్టార్ డైరెక్టర్గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు.తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు.చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.ఆ సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారుఫ్యాషన్ డిజైనర్ రమను ప్రేమ వివాహం చేసుకున్నారు.